## పనిచేస్తున్న సంస్థకే టోకరా..

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23: పని చేస్తున్న సంస్థకే టోకరా వేసి ఉడాయించిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... జూబ్లీహిల్స్ రోడ్ నం.36లోని కేవీఆర్ హోల్డింగ్ సంస్థలో సికింద్రాబాద్‌లోని పార్శిగుట్టకు చెందిన హేమంత్ అనే యువకుడు నాలుగునెలలుగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 19న సంస్థకు చెందిన రూ.2.45 లక్షల నగదు, హీరో ఎలక్ట్రిక్ స్కూటర్‌తో హేమంత్ ఉడాయించాడు. ఫోన్ చేయగా రూ.75వేలు పంపించి స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. దీంతో హేమంత్‌పై మేనేజర్ హరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 23: నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న కిరాణా షాపు నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం... కృష్ణానగర్ బీ బ్లాక్‌లోని శ్రీ సాయి నర్సింహ కిరాణా అండ్ జనరల్ స్టోర్‌లో కొంతకాలంగా పలు బ్రాండ్‌లకు చెందిన నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. పలు బ్రాండ్లకు చెందిన రూ.56వేల విలువైన సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు నిర్వాహకుడు ఏ.సాయిబాబాపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మౌలిక వసతుల కల్పనకు కృషి



రాజేంద్రనగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్ అర్చన

■ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, ఫిబ్రవరి 23 : రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్‌తో కలిసి డివిజన్ పరిధిలో గోల్డెన్ హైట్స్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ నరేందర్‌గౌడ్, జలమండలి అధికారులు, విద్యుత్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



శివసత్తుల ఊరేగింపుతో అమ్మవార్లను గద్దెల మీదకు తీసుకువస్తున్న నిర్వాహకులు చంద్రకుమార్ కుటుంబ సభ్యులు



సమ్మక్క సారక్క జాతరకు విచ్చేసిన భక్తులు

# రాజేంద్రనగర్‌లో సమ్మక్క సారక్క జాతర

బండ్లగూడ, ఫిబ్రవరి 23 : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మానస హిల్స్‌లో శుక్రవారం సమ్మక్క సారక్క జాతర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మేడారంలో నిర్వహించే సమ్మక్క సారక్క జాతర లాగానే ఇక్కడ కూడా రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. మొదటి రోజు డప్పులతో, శివసత్తుల పూనకాల మధ్య సమ్మక్క సారక్కలను ఊరేగింపుగా తీసుకువచ్చి గద్దెలపై కూర్చొబెట్టారు. ఈ జాతరకు రాజేంద్రనగర్ శివారు ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ ఉత్సవాలకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి సమ్మక్క సారక్కను దర్శించుకున్నారు.



## ఎమ్మెల్యే లాస్య నందితకు నివాళి

రోడ్డు ప్రమాదంలో మరణించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత పార్థివదేహానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

– మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 23



## మినీ బస్ టెర్మినల్‌ను నిర్మించండి

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తాలో మినీ బస్ టెర్మినల్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఏఐటీయూ జిల్లా నాయకుడు వనంపల్లి జైపాల్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రిని కలిసిన వారిలో ఏఐటీయూ జిల్లా నాయకులు అనంత మోహన్, యేసురత్నం తదితరులు ఉన్నారు. – బండ్లగూడ, ఫిబ్రవరి 23



మణికొండ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రదీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, తెలంగాణ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీశ్రీ, కౌన్సిలర్ వసంత్‌చౌహాన్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీరాములు, నాయకులు జయరాజ్, బషీర్, రాజ్‌రెడ్డి, భరత్‌రెడ్డి, శ్రావణ్, ఆరిఫ్, నరేందర్, బాలాజీ, కిరణ్, రాజేంద్రప్రసాద్, ఖలీం, విజయలక్ష్మి, గంగ పాల్గొన్నారు. – మణికొండ, ఫిబ్రవరి 23



## రహ్మత్‌నగర్‌ను స్వచ్ఛ డివిజన్‌గా తీర్చిదిద్దాలి

రహ్మత్‌నగర్‌ను స్వచ్ఛ డివిజన్‌గా తీర్చిదిద్దాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, ఏఎంఓహెచ్ డాక్టర్ రవి, శానిటరీ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఏలు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్, ఫిబ్రవరి23

## ఆకర్షణ అక్షర ఉద్యమం

- 7 వేల పుస్తకాల సేకరణతో 10 లైబ్రరీలు..
- సాయమందిస్తున్న స్థానికులు..

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 23: చిట్టి బుర్రలో గట్టి ఆలోచన వచ్చింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్ననాటి నుంచే అక్షర ఉద్యమాన్ని భుజాన వేసుకుంది. బేగంపేట్ పబ్లిక్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న సనత్‌నగర్‌కు చెందిన ఆకర్షణ అనే బాలిక ఇప్పటివరకు 7 వేలకు పైగా పుస్తకాలు సేకరించింది. అంతే కాదు ఆయా పుస్తకాలను నగరంలోని వివిధ ప్రాంతాల్లో అవసరమైన విద్యార్థులు, పిల్లలు, పెద్దలకు అందుబాటులో ఉంచుతుంది. ఆకర్షణ చేపడుతున్న ఈ అక్షర ఉద్యమానికి సనత్‌నగర్‌కు చెందిన స్థానికులు సాయమందిస్తుండటం విశేషం. శుక్రవారం యూసుఫ్‌గూడ మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలోని సర్వీస్ హోమ్‌లో ఆకర్షణ ఏర్పాటు చేసిన 10వ లైబ్రరీని మహిళా శిశు అభివృద్ధి శాఖ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి ఎ.నిర్మల కాంతి వెస్లీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంపై గౌరవంతో అతి చిన్న వయసులో ఆకర్షణ వేలాది పుస్తకాలు సేకరించి లైబ్రరీలు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. పాఠశాలలు, విద్యాసంస్థలు, ఆస్పత్రుల్లో లైబ్రరీ రూపంలో పుస్తకాలు అందుబాటులో ఉంచడం పలువురికి స్ఫూర్తినిచ్చేలా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి అక్కేశ్వర రావు, ఆకర్షణ తల్లిదండ్రులు, అధికారులు పాల్గొన్నారు.



ఆకర్షణతో కలిసి లైబ్రరీని ప్రారంభిస్తున్న మహిళా శిశు అభివృద్ధి శాఖ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి ఎ.నిర్మల కాంతి వెస్లీ

## పార్కుల అభివృద్ధికి చర్యలు



నేతాజీ పార్కు ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న 9వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి

మణికొండ, ఫిబ్రవరి 23: పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మణికొండ మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి అన్నారు. నేతాజీ పార్కులో ప్రహరీ పునరుద్ధరణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రహరీ కూలిపోవడంతో పార్కు పరిస్థితి అధ్వాన్నంగా మారిందన్నారు. మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నామని చెప్పారు. నిర్మాణ సమయంలో పార్కుకు వచ్చే వారు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వి.బాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, చిరంజిత్ ఘోష్, ధీరజ్ పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను ప్రారంభించాలి



జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతిని కలిసి అభివృద్ధి పనులు చేయాలని కోరుతున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

■ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేశ్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23:జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని పెండింగ్ అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతిని కలిసి పెండింగ్ పనులు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ఫిలింనగర్‌లోని దీన్ దయాళ్‌నగర్ బస్తీనుంచి ఏబీఎన్ చానల్ దాకా సీసీ రోడ్డు పనులను ప్రారంభించాలని, డివిజన్‌లోని ఇతర బస్తీల్లో మంజూరైన సీసీ రోడ్డు పనులను చేపట్టాలని కోరారు. దీనికి స్పందించిన డీఎంసీ ప్రశాంతి త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల డిమాండ్లను పరిష్కరించాలి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 23 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఆందోళనలో పాల్గొన్న యువ రైతు శుభకరన్ సింగ్‌ను పొట్టనపెట్టుకోవడం దారుణమైన చర్య అని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ అన్నారు. యువ రైతు మృతికి నిరసనగా అన్ని రాష్ట్రాల్లో బ్లాక్‌డే నిర్వహించాలని ఎస్కేఎం పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం సీఐటీయూ రాజేంద్రనగర్ మండల నాయకులు కాలే రాజు అధ్యక్షతన ఆరాంఘర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఇమ్రాన్, వినోద్, శంకర్‌నాయక్, లడ్డూ, ఖలీల్, జాంగిర్, శ్రీశైలంయాదవ్, మహేశ్ యాదవ్, రాము, కిరణ్ పాల్గొన్నారు.



ఆరాంఘర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

## పలువురు సంతాపం

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 23: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. లాస్యనందిత అకాల మరణం తీరని లోటని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిగౌడ్, బీఆర్‌ఎస్ నేత జి.రామన్‌గౌడ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాస్య నందిత ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 23 : గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన శుక్రవారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... శంషాబాద్ పట్టణంలోని ఇందిర దవాఖాన ఎదురుగా ఉన్న జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద వ్యక్తి చనిపోయినట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా దవాఖానకు తరలించారు. భిక్షాటన చేసే వ్యక్తి అని, వయస్సు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. ఆకలితో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 29న భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 23: దేశ వ్యాప్తంగా భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న నిర్వహించే ఆందోళనలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని తెలంగాణ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం హిమాయత్ నగర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కార్మికుల అడ్డా ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. 60 ఏండ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.6వేల పెన్షన్ మంజూరు, డబుల్ బెడ్ రూం ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కేంద్రంలోని బీజేపీని గద్దె దించాలి



యూత్ కాంగ్రెస్ నేత శివసేనారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ధర్మేంద్ర

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 23: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని గద్దెదించేందుకు యువత సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఈ నెల 28న వరంగల్ జిల్లా, ఎల్‌బీ కాలేజీ జయసేన ఆడిటోరియంలో నిర్వహించే యువజన సమ్మేళనానికి హాజరు కావాలని కోరుతూ శుక్రవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.శివసేనారెడ్డిని కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం వల్ల నిరుద్యోగ సమస్య మరింత జఠిలమవుతుందని ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే వరకు యువత ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్యప్రసాద్, నాయకులు శ్రీమాన్, కల్యాణ్ పాల్గొన్నారు.

## 14 మంది కార్పొరేటర్లు హాజరుకాలేదు..

బండ్లగూడ , ఫిబ్రవరి 23 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాధారణ బడ్జెట్‌కు సంబంధించిన అంశాలపై చర్చలు జరిపినట్లు కమిషనర్ శరత్‌చంద్ర తెలిపారు. కాగా కౌన్సిల్ సమావేశానికి మొత్తం 21 మంది కార్పొరేటర్లు రావాల్సి ఉండగా అందులో ఏడుగురు కార్పొరేటర్లు హాజరయ్యారు. మెజార్టీ కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశానికి రాకపోవడంతో చేసిన తీర్మానాలు చెల్లుబాటు అవుతాయా? లేదా అనే అంశాలను లీగల్ అభిప్రాయం కోసం ప్రభుత్వ న్యాయవాదికి పంపనున్నట్లు శరత్‌చంద్ర పేర్కొన్నారు.

## కారు డ్రైవర్ అదృశ్యం



పుల్లారావు(ఫైల్)

ఖైరతాబాద్, ఫిబ్రవరి 23 : కారు డ్రైవర్ అదృశ్యమైన ఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ శ్రీరాములు కథనం ప్రకారం... ఖైరతాబాద్ ప్రేమ్‌నగర్‌కు చెందిన కొండ్రు లక్ష్మి, పుల్లారావు దంపతులు. పుల్లారావు కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 20న కారు డ్రైవింగ్ కోసం వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వాత ఫోన్‌లో మాట్లాడుకుంటూ బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పేదల సంక్షేమానికి పెద్దపీట

పేద ప్రజల సంక్షేమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే మరోసారి ఆయనను ప్రధానమంత్రిని చేస్తాయని భారతీయ జనతా పార్టీ, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. విజయ సంకల్ప యాత్రను శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి దుర్గానగర్ చౌరస్తా నుంచి చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

– మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 23



## బస్సులో నిద్ర.. గొలుసు మాయం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23 : బస్సులో కిటికీ పక్కన కూర్చున్న ఓ మహిళ ప్రయాణికురాలి మెడలోనుంచి బంగారు గొలుసు మాయమైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం... బడంగ్‌పేట నివాసి లలిత జూబ్లీహిల్స్‌లోని ఓ నగల దుకాణంలో పని చేస్తుంది. ఇంటినుంచి ఉదయం 10.30 సమయంలో ఉద్యోగానికని ఆమె 222ఏ బస్సులో కోఠి నుంచి జూబ్లీహిల్స్‌కు బయలుదేరింది. కిటికీ పక్కన సీటు దొరకడంతో కాసేపటికి నిద్రలోకి జారుకుంది. బంజారాహిల్స్ రోడ్ నం.1 మీదుగా కేబీఆర్ పార్క్ సిగ్నల్ వద్దకు వస్తున్న క్రమంలో నిద్రలోంచి మెలకువ వచ్చిన ఆమె మెడలోని మూడున్నర తులాల మంగళసూత్రం మాయమైనట్టు గుర్తించింది. వెంటనే బస్సు డ్రైవర్‌కు చెప్పగా కేబీఆర్ పార్కువద్ద బస్సు ఆపాడు.బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సినీనటుడు అలీ

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 23: తెలుగు టెలివిజన్ డిజిటల్ మీడియా టెక్నీషియన్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టీవీ కార్మికుల కోసం 'మన అమెరికన్ తెలుగు అసోసియేషన్' ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సినీ నటుడు అలీ సందర్శించారు. ప్రముఖ యాంకర్ సుమ కనకాల సౌజన్యంతో చెన్నై శంకర్ నేత్రాలయం వైద్య బృందం పేద టీవీ కళాకారులకు, కార్మికులకు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ నాగబాల సురేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రమేశ్, సంపత్, సలహాదారు పి. మురళి, నర్సింగ్‌రావు, శరత్ తదితరులు పాల్గొన్నారు.



దుకాణాదారులకు చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

## చెత్త బుట్టలు పంపిణీ

బండ్లగూడ,ఫిబ్రవరి 23 : ప్రజలందరూ తమ ఇంటి పరిసరాల పరిశుభ్రత కోసం పాటు పడాలని జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దుకాణాదారులకు జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీ రవికుమార్ మాట్లాడుతూ.. ఇండ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను ఆరుబయట వేయకుండా తడి, పొడి చెత్తగా వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలని సూచించారు. ఆరుబయట చెత్తను పారవేయడం ద్వారా అనేక అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు పాటు పడాలని కోరారు.

## దాతలు సహకరించాలి



దేవాలయం స్లాబ్ పనులను పరిశీలిస్తున్న నిర్వాహకులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 23 : దేవాలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని బీఆర్‌ఎస్ అలీకోల్‌తండా గ్రామ కమిటీ అధ్యక్షుడు హేమ్లానాయక్ కోరారు. మండలంలోని అలీకోల్‌తండాలో పురాతనమైన మైసమ్మ దేవాలయాన్ని పునర్నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం దేవాలయంలో స్లబ్ పనులు పూర్తి చేశామన్నారు. అమ్మవారి దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు కోరిక మేరకు పునర్ నిర్మాణం చేయడానికి కమిటీని ఏర్పాటు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లయ్య, రూప్లానాయక్, కిషన్, హిమ్లానాయక్, శంకర్,చందర్, బాబు తదితరులు పాల్గొన్నారు.